అంతిమ కర్మకు ఆవాసం

- పట్టణంలోని శ్మశానవాటికలో ప్రత్యేక గదులు
- రూ.20లక్షల నిధులతో నిర్మాణం
- త్వరలో ప్రారంభానికి సిద్ధం


శ్మశాన వాటికలో నిర్మించిన ప్రత్యేక భవనం

నర్సంపేట : స్వతంత్ర భారత్‌లో చావు కూడా పెళ్లి లాంటిదే బ్రదర్.. ఎప్పుడో ఓ సినీ కవి రాసిన పాట.. ఈ పాట ఎలా ఉన్నా.. పాడె కట్టడానికి కూడా ఆరడుగుల జాగ లేని నిరుపేదల పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికీ కిరాయి ఇళ్లలో ఉండే వారిలో ఎవరైనా మరణిస్తే మృతదేహాన్ని వాకిట్లో కూడా వేయకూడదనే కట్టుబాట్ల మధ్య వారికి అంత్యక్రియలు చేయడానికి ఆ కుటుంబం పడే ఆవేదన.. ఆ బాధ వర్ణనాతీతం. మాటల్లో చెప్పలేని ఆ దయనీయ స్థితికి నర్సంపేట పట్టణ మున్సిపాలిటీ అంతిమ పరిష్కారం చూపేందుకు నడుం బిగించింది. ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆలోచనతో మున్సిపల్ చైర్‌పర్సన్ సారథ్యంలోని పాలకవర్గం ఆఖరి మజిలీకి ఆవాసం ఏర్పరిచేందుకు ప్రణాళికలు రూపొందించింది.

రూ.20లక్షల జనరల్ ఫండ్‌తో..

ఆలోచన వచ్చిందే తడవుగా అమలు చేసేందుకు మున్సిపాలిటీ పాలకవర్గం చకచకా పావులు కదిపింది. గత నెలలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆమోదం తెలిపింది. అనంతరం సాధారణ నిధుల నుంచి రూ.20లక్షల కేటాయించింది. మాధన్నపేట సమీపంలోని హిందూ శ్మశాన వాటికలో రెండు కుటుంబాలు తమ వారికి కర్మకాండలు నిర్వహించుకునేలా నిర్మాణాలు చేపట్టింది. దాదాపు ఆ పనులు పూర్తి కావొచ్చాయి. త్వరలో ఈ గదులను ప్రారంభించేందుకు పాలకవర్గం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పనులను వేగంగా చేయిస్తోంది. దీంతో త్వరలో పనులు పూర్తి చేయించి ప్రారంభించాలని కసరత్తు చేస్తున్నారు.

నిరుపేదల ఇజ్జత్ కాపాడే..

మున్సిపల్ పాలకవర్గం తీసుకున్న నిర్ణయంతో ఇళ్లు లేని కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. అయినవారు చనిపోతే నడిరోడ్డు మీదే శవంతో కనీసం ఇంటిల్లిపాది ఆఖరి చూపు చూసుకునే వీలులేని దుస్థితికి ఎమ్మెల్యే ఒక మంచి ఆలోచన చేయడం ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి పట్టణానికి ఉపాధి కోసం వచ్చిన వారు దాదాపు రెండు వేల కుటుంబాల వరకు ఉంటాయని, వారందరికీ మున్సిపాలిటీ ఒక ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచిందని ప్రశంసిస్తున్నారు. కాగా నర్సంపేటలో చేపట్టిన ఈ నిర్మాణం భారత దేశంలోనే ఎక్కడ ఇప్పటి వరకు ఉండబోదని, ఇదే మొదటిదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

పేదల కష్టాలు గ్రహించాం..



ఇళ్లు లేని పేదలు మరణించిన సమయంలో అద్దెకు ఉంటున్న ఇంటి నుంచి చివరి క్షణాలను గడిపే పరిస్థితులు లేకపోవడంతో పాటు కరోనా సమయంలో చనిపోయిన వారి మృతదేహాలను అద్దె యజమానులు ఇంటికి తీసుకురావడానికి నిరాకరించడం లాంటి సంఘటనలు కలిచివేశాయి. ఇలాంటి వారికి చివరి క్షణంలో ఇబ్బందులు ఎదురు కాకుండా ఉండేందుకు శ్మశాన వాటిక స్థలంలో ప్రత్యేక భవనం నిర్మించాం.

\- పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్యే నర్సంపేట

సహకారంతో నిర్మించాం..



అద్దె ఇంట్లో ఉంటున్న పేదలకు చివరి క్షణాల్లో కర్మకాండలతో పాటు ఇతర అవసరాలకు ఉపయోగపడే విధంగా ప్రత్యేక భవనాన్ని నిర్మించాలనే సంకల్పంతో నిధులు కేటాయించాం. మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యుల సహకారంతో నిరుపేదలందరికి ఉపయోగపడే భవనాన్ని నిర్మించే అవకాశం నాకు లభించడం సంతోషం.. కొద్ది పాటి పనులు పెండింగ్‌లో ఉన్న పనులను త్వరలో పూర్తి చేసి ఎమ్మెల్యే సహకారంతో భవనాన్ని ప్రారంభిస్తాం.

\-గుంటి రజనికిషన్, మున్సిపల్ చైర్‌పర్సన్

క్లుప్తంగా

పోస్టర్ల ఆవిష్కరణ



ఆత్మకూరు : జూన్ 1న హనుమకొండ జిల్లాలోని కాజీపేట శివారులోని మడికొండలో నిర్వహించనున్న రెడ్డి సంఘం ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు రేవూరి ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమ వాల్ పోస్టర్‌ను మండల కేంద్రంలో శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రెడ్డి కులస్తుల సంక్షేమం, సమస్యల పరిష్కారం, రెడ్డి కార్పొరేషన్ సాధన దిశగా సమ్మేళనంలో చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రేవూరి జయపాల్‌రెడ్డి, దేవేందర్ రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్య



పరకాల : ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బేతి సంతోష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ఆ కళాశాలలో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించేలా మండలంలోని పలు గ్రామాల్లో అధ్యాపకులతో కలిసి శనివారం ఆయన పర్యటించారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరితే కలిగే ప్రయోజనాలను ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వివరించారు. అత్యున్నత విద్యార్హతలు, సుదీర్ఘ అనుభవం కలిగిన అధ్యాపకులు విద్యాబోధన అందిస్తారని చెప్పారు. ప్రభుత్వం అనేక జనరల్, వృత్తివిద్యా కోర్సులు అభ్యసించే అవకాశం కల్పించిందని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరితే బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చని సూచించారు. ఎన్‌సీసీ, టీఎస్‌కేసీ వంటి విభాగాల ద్వారా విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. మండలానికి చెందిన ఇంటర్మీడియట్ పూర్తి చేసిన అర్హులైన విద్యార్థులందరూ 'దోస్త్' ద్వారా తప్పకుండా గడువులోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

వేలం వాయిదా

పరకాల : సరైన వేలం రాకపోవడంతో పరకాల తైబజార్ లీజు వేలం పాటను ఈనెల 30కి వాయిదా వేస్తున్నట్లు స్థానిక మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి ప్రకటించారు. 2023–24 సంవత్సరానికి గాను పట్టణంలోని తైబజార్ లీజు కోసం టీపీఓ రాజు పర్యవేక్షణలో శనివారం సీల్డు టెండర్, బహిరంగ వేలం నిర్వహించారు. ముగ్గురు డిపాజిట్ చెల్లించి పాల్గొన్నప్పటికీ సరైన వేలం రాకపోవడంతో మున్సిపల్ ఆదాయానికి నష్టం జరిగే అవకాశం ఉండడంతో 30కి వాయిదా వేస్తూ కమిషనర్ నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ బిల్ కలెక్టర్ తిరుపతి, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



నడికూడ : కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రాంరెడ్డి ఆదేశాల మేరకు మండలానికి చెందిన ఇద్దరు మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం అందించారు. తొలుత నర్సక్కపల్లె గ్రామానికి చెందిన పెద్ద సాంబయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ శనివారం ఆర్థిక సాయం అందించారు. అనంతరం వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన పెగడ కనకలక్ష్మి ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబీకులకు సాయం అందించారు. రెండు కుటుంబాలనూ దేవేందర్ పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు కుమారస్వామి, రాజు, సుమన్, తిరుపతిరెడ్డి, విష్ణు, రాజయ్య, సంతోష్, ఐలయ్య, రజనీకర్ తదితరులు పాల్గొన్నారు.

పని దినాలను పెంచాలి

ఆత్మకూరు : ఉపాధి పని దినాలను ఏడాదికి 200 రోజులకు పెంచాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని నాగయ్యపల్లె, అక్కంపేట గ్రామాల్లో ఆ ఫ్రంట్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులను శనివారం పరిశీలించారు. కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేశారు. అనంతరం సురేష్ మాట్లాడారు. ఉపాధి కూలీలు సరైన ఆదాయం దక్కక, ఇతర సమస్యలతో సతమతమౌతున్నారని చెప్పారు. ఉపాధి సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కొలతలతో సంబంధం లేకుండా రోజువారీ కూలిని రూ.600లకు పెంచి చెల్లించాలని, పని ప్రదేశాల్లో తాగునీటి, ఇతర మౌలిక వసతులు కల్పించడంతోపాటు కూలీలకు బీమా సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు.

మిల్లర్లు ధాన్యం తీసుకోవడం లేదు


నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎంపీపీ సౌజన్య

గీసుకొండ : రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని నిర్వాహకులు కొనుగోలు చేయడం లేదని, మిల్లర్లు నూకలు ఎక్కువగా వస్తున్నాయని తిప్పి పంపుతున్నారని ఎంపీపీ భీమగాని సౌజన్య అన్నారు. శనివారం మండలంలోని ఊకల్‌సొసైటీలో ధాన్యం కొనుగోలు నిలిపివేయడంతో విషయం తెలుసుకుని ఆమె వెళ్లి పరిశీలించారు. అయితే ధాన్యం నాణ్యతగా ఉండటం లేదని, 68 శాతం బియ్యం రావాల్సి ఉండగా అధికంగా నూకలు వస్తున్నాయని, అందువల్ల మిల్లర్లు తీసుకోవడం లేదని కొనుగోలు కేంద్రం వారు ఆమెకు బదులిచ్చారు. అధికంగా నూకలు వస్తే ఎఫ్‌సీఐ వారు తీసుకోవడం లేదని మిల్లర్లు చెబుతున్నారని ఆమె పేర్కొన్నారు. నాసిరకంగా ఉన్నా కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తోందని, వాస్తవానికి అది అమలు కావడంలేదని ఎంపీపీ ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు మేలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

30నుంచి 'మహాజన సంపర్క్ అభియాన్'


మాట్లాడుతున్న రాయపురం కుమారస్వామి

వర్ధన్నపేట : ఈనెల 30 నుంచి జూన్ 30వరకు బీజేపీ నిర్వహించనున్న మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో మండలంలోని రాష్ట్ర, జిల్లా, మండల, బూత్ స్థాయి నాయకులు, సామాన్య కార్యకర్తలు పార్టీ సూచనల మేరకు పని చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాడిపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ పాలనతో దేశ ప్రతిష్ట ప్రపంచ వ్యాప్తంగా మారుమోగుతోందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాడిపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని ఇల్లందలో ఏర్పాటు చేసిన బీజేపీ కార్యవర్గ సమావేశానికి పార్టీ మండల అధ్యక్షుడు రాయపురం కుమారస్వామి అధ్యక్షత వహించారు. మండలంలోని మహాజన్ సంపర్క్ అభియాన్ ఇన్‌చార్జ్‌లుగా మండల ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి కృష్ణమూర్తి, మండల ఉపాధ్యక్షుడు సింధం శ్రీనివాస్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కర్ర సోమిరెడ్డి, మండల సోషల్ మీడియా కన్వీనర్ మైస రాజును ఎంపిక చేశారు. వీరితో పాటు కార్యవర్గ సభ్యులుగా నాంపెల్లి యాకయ్య, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పంజా వెంకటేశ్వర్లు ఉన్నారు. ఈ సమావేశంలో కుందూరు మహేందర్‌రెడ్డి, డోలి సతీష్, ఎలిశాల రాకేష్, సట్ల భిక్షపతి, కిషన్, న్యాలం సాయిలు, మంచె సాయిలు, మంచె యాదమ్మ, మధు, రామరాజు, ప్రశాంత్, హరీష్, శ్రీనివాస్, శంకర్, ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రాస్తారోకో


నల్లబెల్లి: శనిగరంలో రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, రైతులు

పర్వతగిరి : ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని మండలంలోని జమాల్‌పురం గ్రామ కొనుగోలు కేంద్రం వద్ద కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈమేరకు ధాన్యం తగులబెట్టి నిరసన తెలిపారు. ఈసందర్భంగా కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో వడ్లు పోసి రెండు నెలలు గడుస్తున్నా.. కాంటాలు కావడం లేదని స్థానిక ఎమ్మెల్యే రమేశ్, మంత్రి ఎర్రబెల్లి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ధర్నా విషయం తెలుసుకున్న తహసీల్దార్ కోమి, ఎస్సై దేవేందర్ సిబ్బందితో అక్కడికి చేరుకుని నాయకులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు చేపట్టి వెంటనే తరలిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం చౌటపల్లి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. పర్వతగిరి సీఐ శ్రీనివాస్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. జున్ను కనకయ్య, దేవేందర్‌రావు, శంకర్, నిమ్మల దేవేందర్, బండి సదయ్య, బైరబోయిన సదయ్య, గోదారి యాకయ్య, జిల్లా హరీష్, రాజు, రజనీకాంత్, రైతులు పాల్గొన్నారు.


పర్వతగిరి: రోడ్డుపై ధాన్యాన్ని తగులబెట్టి నిరసన తెలుపుతున్న రైతులు, నాయకులు

చర్యలు తీసుకోవాలి..

నల్లబెల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి బలవంతంగా వాంగ్మూల పత్రాలు తీసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి అన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, కొనుగోళ్లు త్వరగా చేపట్టాలని పార్టీ ఆధ్వర్యంలో శనిగరంలోని జాతీయ రహదారిపై శనివారం రాస్తారోకో చేశారు. గంటపాటు కొనసాగిన రాస్తారోకోతో ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న ఎస్సై నైనాల నగేశ్ రాస్తారోకో వద్దకు చేరుకుని కాంగ్రెస్ నాయకులతో చర్చించి రాస్తారోకోను విరమింపజేశారు. కార్యక్రమంలో నాయకులు ఇస్తారి శేఖర్, చార్ల శివారెడ్డి, పెంతల కొంరారెడ్డి, ఎడాకుల సంపత్‌రెడ్డి, చేల్పూరి జ్యోతి, పురుషోత్తం సురేశ్, భూక్య బావ్‌సింగ్, కుసుంబ రఘుపతి, కడుదూరి కట్టయ్య పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖానాపురం : మండలంలోని ఆదర్శ(మోడల్) కళాశాలలో ఖాళీ సీట్ల భర్తీ కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ దామెర రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బుధరావుపేట మోడల్ జూనియర్ కళాశాలలో ఈనెల 30వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు సమయాన్ని పెంచడం జరిగిందన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సుల్లో 40 చొప్పున సీట్లు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.

మండల కమిటీ ఎన్నిక


సందీప్‌రెడ్డి, అధ్యక్షుడు


అరుణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి

చెన్నారావుపేట : జనసేన పార్టీ మండల నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నట్లు నర్సంపేట నియోజకవర్గ కోఆర్డినేటర్ మేరుగు శివకోటి యాదవ్ తెలిపారు. అధ్యక్షుడిగా భీముడు సందీప్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా పసునూరి నరేష్, రాజ్‌కోటి ఈశ్వర్, ప్రధాన కార్యదర్శిగా గాండ్ల అరుణ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కుండె నాగేంద్రకుమార్, ఆవుల శివరాజు, మాదారపు రాము, కార్యదర్శిగా కర్కాల రణదీప్, బత్తిని సందీప్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నాంపెల్లి శ్రీకాంత్, రాధారపు రవికుమార్, కోరె శివకుమార్, బుడిగె భార్గవ, మేడి కార్తిక్, బూరుగు రాజేందర్‌లను ఎన్నుకున్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న మహిళలు

దుగ్గొండి : లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద మహిళా మల్లయోధులు నిర్వహిస్తున్న పోరాటానికి మద్దతుగా మండలంలోని తిమ్మంపేటలో మహిళలు శనివారం రాత్రి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. పీఓడబ్ల్యూ స్త్రీ సంఘటన్, ప్రగతిశీల యువజన సంఘం, తెలంగాణ రైతు సంఘం మహిళలకు మద్దతుగా నిలిచాయి. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ స్త్రీ సంఘటన్ రాష్ట్ర కార్యదర్శి మోడెం శ్రీలత మాట్లాడారు. ఎంపీ బ్రిజ్‌భూషణ్ మహిళా మల్లయోధులను లైంగికంగా వేధించడం సిగ్గుచేటన్నారు. బేటీ బచావో.. బేటీ పడావో నినాదం ఇచ్చే ప్రధాని మహిళలకు ఎలాంటి రక్షణ కల్పిస్తున్నాడో సమాజం గమనిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మేక దేవేంద్ర, శోభ, భాషబోయిన అనిత, గంగరబోయిన విజయ, మేక సుజాత, భూమ కవిత, పూలక్క, ప్రజా సంఘాల నాయకులు అశోక్, సతీష్‌కుమార్, కుమార్, రాజ్‌కుమార్, చిరంజీవి, ప్రశాంత్, కుమారస్వామి, రాజేష్, సాయి పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలు


పూజలు చేస్తున్న అర్చకులు

రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను శనివారం కొనసాగించారు. అత్యంత భక్తిశ్రద్ధలతో గ్రామస్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లేతాకుల సుమతియాదవరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, ఎంపీటీసీ గాడిపెల్లి వెంకన్న, ఉపసర్పంచ్ బాధ సారయ్య, బొమ్మినేని రంగారెడ్డి, బొమ్మినేని బుచ్చిరెడ్డి, పర్పాటి యాదవరెడ్డి, ఉప్పుగల్ల రంగయ్య, గూడెల్లి వెంకటయ్య, బొమ్మినేని పాపిరెడ్డి, గబ్బెట బాబు, రంగారెడ్డి, సుధాకర్‌రెడ్డి, గాడిపెల్లి రాములు, బైరి యాకయ్య, అలువాల కుమార్, కోల అనిల్, ఎల్లారెడ్డి, బొమ్మినేని సత్తిరెడ్డి, రాముడు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


వాలీబాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

వర్ధన్నపేట : మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన క్రీడాకారులు వాలీబాల్ జిల్లా పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాల పీఈటీ వీరస్వామి, వాలీబాల్ కోచ్ జలగం రఘువీర్ తెలిపారు. ఈ నెల 22, 23, 24 తేదీల్లో వరంగల్‌లో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో ఉప్పరపల్లి గ్రామానికి చెందిన అనూష, వైష్ణవి, అశ్వినితో పాటు నల్లబెల్లి గ్రామానికి చెందిన నిరోషా అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. వీరిని శనివారం ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ భిక్షపతి, సర్పంచ్ ఆరెల్లి స్రవంతి, ఎంపీటీసీ రజిత, గజ్జెల రమేష్ బాబు అభినందించారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎస్సై

పర్వతగిరి : రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ కోమి, ఎస్సై దేవేందర్ అన్నారు. ఈ మేరకు మండలంలోని గోపనపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్, ఎస్సై శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైస్ మిలర్ల అవినీతిపై చర్యలు తీసుకుని, సకాలంలో లారీలు వచ్చి ధాన్యం తరలించేందుకు కృషి చేస్తామన్నారు. పండించిన పంటలో కోత లేకుండా అవకతవకలపై పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతుల సమస్యలు పరిష్కరిచేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పంజా మహేష్, ఎంపీటీసీ నూర రమేష్, వార్డు మెంబర్ అన్నయ్య, సెంటర్ ఇన్‌చార్జ్ వెంకటయ్య, సెక్రటరీ సదానందం, కారోబార్ రాజు, రైతులు బెల్లం కుమార్, బోయిని ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


చెన్నారావుపేట: వినతిపత్రం అందజేస్తున్న రాజు


నెక్కొండ: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

- డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు
- వినతిపత్రం అందించిన జీపీ కార్మికులు

చెన్నారావుపేట : రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ నర్సంపేట డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు అన్నారు. ఈ మేరకు జల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి మహేష్‌కు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి పరిష్కరించాలన్నారు. జీఓ నంబర్ 60ప్రకారం స్వీపర్లకు రూ.15,600, బిల్ కలెక్టర్, కారోబర్‌లకు రూ.19,500, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.22,750 వేతనం నిర్ణయించాలన్నారు. జీపీ సిబ్బంది కోసం ప్రత్యేక గ్రాంట్‌ను ఏర్పాటు చేసి వేతనాలు చెల్లించాలన్నారు. పెండింగ్ వేతనాలు వెంటనే రిలీజ్ చేయాలని తెలిపారు. జీఓ నంబర్ 51ని సవరించాలని, ప్రమోషన్ కల్పించాలన్నారు. ప్రతి వర్కర్‌కి ఇన్సూరెన్స్ రూ.5లక్షలు అమలు చేయాలని, ప్రమాద బీమా రూ.10 లక్షలు, దహన సంస్కారాలకు రూ.30 వేలు అందించాలన్నారు. వీటితో పాటు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. లేని ఎడల రాష్ట్ర కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్మికులు మంచాల భిక్షపతి, దొంతరబోయిన రాజేందర్, కాలపాక కృష్ణయ్య, యాకలక్ష్మి తదితరులు ఉన్నారు.

వినతిపత్రం అందజేత

నెక్కొండ : రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) మండల అధ్యక్షుడు భూక్యా నరేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నెక్కొండ సర్పంచ్ సొంటిరెడ్డి యమునారెడ్డి, ఈఓ సదానందానికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరిగిన నిత్యావసర సరుకులకు అనుగుణంగా ఉద్యోగ, కార్మికులకు వేతనాలు చెల్లించాన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 51 జీఓను సవరించి, మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఈదునూరి సాయిలు, మదార్, రాజు, కొమురయ్య, సంతోష్, హేమ, స్వరూప, లచ్చమ్మ, యాకయ్య, నర్సమ్మతోపాటు తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు


తండ్రి అంత్యక్రియల్లో కూతురు నందిని, స్థానికులు

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన పైసా సదానందం విద్యుదాఘాతంతో శుక్రవారం మృతి చెందాడు. కాగా శనివారం నిర్వహించిన అంత్యక్రియల్లో సదానందం పెద్ద కుమార్తె నందిని తండ్రికి తలకొరివి పెట్టింది. బాధిత కుటుంబం పేదరికంలో ఉండటంతో ఎస్సై తోట మహేందర్ పాక్లెయినర్ సాయంతో సమాధి తీయించి మానవత్వం చాటుకున్నాడు. బర్ల దేవదాసు, కొంకటి రమేష్, రవి, సొసైటీ డైరెక్టర్ రాజు, నర్మెట్ట సాంబయ్య, యాదగిరి, నర్సింగరావు, సామ్యేల్, రమేష్, సంపత్, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నల్లబెల్లి : మాజీ ఎంపీపీ బానోత్ సారంగపాణి తల్లి గూమ్లి(85) అనారోగ్యంతో శనివారం ఉదయం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. గూమ్లి మృతదేహంపై పూలమాల వేసి సంతాపం ప్రకటించారు. పరామర్శించిన వారిలో నాయకులు ఊడుగుల ప్రవీణ్ గౌడ్, గండె శ్రీనివాస్ గుప్తా, కొత్తపల్లి కోటిలింగాచారి, మామిండ్ల మోహన్‌రెడ్డి, మాలోత్ ప్రతాప్ సింగ్, నానబోయిన రాజారాం, సర్పంచ్ మల్లక్క, ఎంపీటీసీ విజయ, కారుకూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.